సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



ఇకపై నిరంతర విద్యుత్తు

మడకశిర నియోజకవర్గంలో విద్యుత్తు సరఫరా సమస్యలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

8లో



టమాట కిలో రూ.8.50

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8.50 పలికింది. కనిష్టం రూ.2, సరాసరిన రూ.6 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.4°/21.8°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

విఘ్నాలు తొలగాలి

- జిల్లావాసులకు కలెక్టర్, ఎస్పీ వినాయక చవితి శుభాకాంక్షలు




పుట్టపర్తి అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ అరుణ్ బాబు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, విఘ్నాలు తొలగాలని ఆకాంక్షించారు. వినాయకుడి అనుగ్రహంతో ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు సిద్ధించాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలు ప్రమాదకరమని, మట్టి విగ్రహాలనే కొలువుదీర్చాలని కోరారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా పండుగ జరుపుకోండి

పుట్టపర్తి అర్బన్: వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ మాధవ రెడ్డి సూచించారు. జిల్లావాసులకు ఆదివారం ఒక ప్రకటనలో ఆయన పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామి దయతో విఘ్నాలు తొలగి విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి కుటుంబంపైనా ఉంటాయన్నారు. గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. వినాయక మంటపాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

పోలీస్ స్పందన రద్దు..

చవితిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే 'స్పందన' కార్యక్రమం రద్దు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి వెల్లడించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పీఏబీఆర్‌లో పెరుగుతున్న నీటి మట్టం



కూడేరు: మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం పెరుగుతోంది. ఆదివారం నాటికి డ్యాంలో నీటి నిల్వ 2.82 టీఎంసీలు ఉన్నట్లు ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా రోజూ 200 క్యూసెక్కుల నీరు పీఏబీఆర్‌లోకి చేరుతోందన్నారు. పీఏబీఆర్ వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి, అనంతపురం, శ్రీరామరెడ్డి, ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు 70–90 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు. మరో 20 క్యూసెక్కులు లీకేజీల రూపంలో బయటకు వెళ్తోందన్నారు.

పనులు త్వరితగతిన చేపట్టాలి



అధికారులతో చర్చిస్తున్న రైల్వే డివిజనల్ మేనేజర్ మనీష్ అగర్వాల్

ధర్మవరం అర్బన్: ధర్మవరం రైల్వేస్టేషన్ పరిసరాల్లో భవన నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని డివిజనల్ రైల్వే మేనేజర్ మనీష్అగర్వాల్ తెలిపారు. ధర్మవరం రైల్వే స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయాలు పరిశీలించారు. అధికారుల పనితీరుపై ఆరా తీశారు. ధర్మవరం–బెంగళూరు డబుల్ లైన్ పనులు పరిశీలించారు. రైల్వేస్టేషన్లలో నూతనంగా నిర్మించనున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జికి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. అధికారులు, కాంట్రాక్టర్ల సమన్వయంతోనే రైల్వే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీఎల్ వెస్ట్ ఇంజినీర్ సాయికృష్ణ, ఆర్పీఎఫ్ సీఐ బోయ కుమార్, రైల్వే స్టేషన్ మేనేజర్ నరసింహనాయుడు, జీఆర్పీ పోలీసులు, తదితరులున్నారు.

పలు చోట్ల వర్షం



పుట్టపర్తి అర్బన్: జిల్లాలో ఆదివారం పలు చోట్ల వర్షం పడింది. అత్యధికంగా గోరంట్ల మండలంలో 56.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అమడగూరు మండలంలో 43.4 మి.మీ, నల్లచెరువు –42.4, చిలమత్తూరు–41.6, తనకల్లు– 38.6, ఓడీ చెరువు–28.4, సోమందేపల్లి–24.2, పెనుకొండ–22.4, నల్లమాడ–18.4, లేపాక్షి–18.4, అమరాపురం–13.8, రొద్దం–11.2,కొత్తచెరువు –10.8, పుట్టపర్తి–9.4, హిందూపురం–8.2, బుక్కపట్నం–7.4, సీకేపల్లి–4.8, కదిరి మండలంలో 4 మి.మీ మేర వర్షపాతం నమోదైంది.



పండుగకు పూజా సామగ్రి కొనుగోలుదారులతో సందడిగా మారిన ధర్మవరం ప్రధాన వీధి



మడకశిర సమీపంలో వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న యువకులు

దీవించయ్యా.. ఉండ్రాళ్లయ్యా

జిల్లాలో వినాయక చవితి సందడి నెలకొంది. వాడవాడలా గణేశ్ మంటపాలు ఏర్పాటయ్యాయి. పూలు, పండ్లు తదితర సామగ్రి దుకాణాలు ఆదివారం కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. విభిన్న రూపాల్లో రూపుదిద్దుకున్న లంబోదరుడి ప్రతిమలను యువకులు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. సోమవారం గణనాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. – సాక్షి బృందం

ఆపదలో అండ



''నా పేరు కేశాని లలిత. పెనుకొండ మండలం, కురుబవాండ్లపల్లి గ్రామం. నా భర్త నాగభూషణ రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. కుటుంబపెద్ద మరణంతో నాకు దిక్కుతోచలేదు. అలాంటి స్థితిలో మా ఇంటి వద్దకు సచివాలయ సిబ్బంది వచ్చి తక్షణ సహాయం అందించి వైఎస్సార్ బీమాకు దరఖాస్తు చేయించారు. నెల తిరగకనే నా ఖాతాలో రూ.5 లక్షలు జమయింది. కొండంత అండనిచ్చిన జగనన్నకు కృతజ్ఞతలు.''

- ధీమా ఇస్తున్న వైఎస్సార్ బీమా
- నెలల వ్యవధిలోనే ఖాతాల్లో నగదు జమ
- పుట్టెడు దుఃఖంలో కూరుకుపోయిన బాధితులకు సీఎం జగన్ చేయూత
- బీమా సంస్థలు తప్పుకున్నా సొంతంగా పరిహారం అందజేత
- దేశంలోనే ఎక్కడా లేని విధంగా అమలు



కేశాని లలితకు తక్షణ సాయం రూ. 10 వేలు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: అయిన వారిని కోల్పోయిన పుట్టెడు దుఃఖంలో మునిగిన బాధితులకు తానున్నా అంటూ వైఎస్ జగన్ సర్కారు అండగా నిలుస్తోంది. బీమా ద్వారా రూ. లక్షల మేర సాయం అందిస్తూ ఉపశమనం కలిగిస్తోంది. కుటుంబ పెద్ద మరణంతో దిక్కుతోచని స్థితిలో పడిన మహిళలకు ఓ అన్నలా, ఓ తమ్ముడిలా సీఎం జగన్ చేయూతనిస్తున్నారు.

బీమా కంపెనీలు తప్పుకున్నా వెరవకుండా..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే 'వైఎస్సార్ బీమా' పథకానికి శ్రీకారం చుట్టారు. ఊహించని విధంగా ప్రమాదాలు జరిగి ఎవరైనా మృత్యు ఒడి చేరినా, వైకల్యం కలిగినా వెంటనే ఆదుకునేందుకు బీమా ఎంతో ఉపయోగపడుతోంది. అయితే, ఇటీవల బీమా కంపెనీలు ఈ పథకం నుంచి తప్పుకున్నాయి. అయినా, ఎక్కడా తగ్గకుండా ఆపన్నహస్తం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో పరిహారం జమ చేసేలా చర్యలు తీసుకుంది. దేశంలోనే ఎక్కడా లేని విధంగా పూర్తి ఖర్చు భరిస్తూ బీమా అమలు చేస్తున్నారు.

నెలల వ్యవధిలోనే...

గతంలో బీమా సంస్థల నుంచి పరిహారం విడుదలకు ఒక్కోసారి ఏడాది పట్టేది. ప్రమాద బాధితుల వివరాలు, సర్టిఫికెట్లు పంపినా ఆలస్యమయ్యేది. దీంతో బాధితులు ఎన్నో ఇబ్బంది పడేవారు. అలాంటి దుస్థితికి ఫుల్‌స్టాప్ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేడు నెలలోపే లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. మృతుల వివరాలు సచివాలయాల ద్వారా ప్రభుత్వానికి పంపగానే 21 రోజుల్లోనే బీమా మొత్తాన్ని నామినీ ఖాతాల్లో జమ చేస్తున్నారు. గత రెండు నెలల కాలంలో జిల్లాలో జరిగిన ప్రమాదాల్లో 8 మంది ప్రాణాలు కోల్పోగా, రోజుల వ్యవధిలోనే మొత్తం రూ.40 లక్షలు బాధితుల ఖాతాల్లో జమ కావడం గమనార్హం.

బీమా ప్రయోజనాలు		
సహజ మరణం	18-50	రూ.2 లక్షలు
ప్రమాదం వల్ల మరణం	18-50	రూ. 5 లక్షలు
శాశ్వత వైకల్యం	51-70	రూ. 3 లక్షలు
పాక్షిక వైకల్యం	18-70	రూ.1.50లక్షలు

రూ. 5 లక్షలు అందింది



మాది చిలమత్తూరు మండలం బలిజిపల్లి గ్రామం. నాకు, నా భర్త విష్ణువర్ధన్‌రెడ్డికి వ్యవసాయమే జీవనాధారం. గత నెల 7న పంటకు నీళ్లు పారబెట్టేందుకు వెళ్లిన నా భర్త విద్యుత్ షాక్‌కు గురై పొలంలోనే ప్రాణాలు విడిచాడు. చేతిలో చిల్లగవ్వ లేక ఏం చేయాలో తెలియని దిక్కు తోచని స్థితిలో ఉన్న నాకు సచివాలయ సిబ్బంది తక్షణ సాయం కింద రూ.10 వేలు ఇచ్చారు. ఆ తర్వాత కేవలం 21 రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా మొత్తం రూ.5 లక్షలు ఖాతాలో జమ చేసింది.

– ఉమాదేవి

దేవుడే పంపాడేమో..



నా భర్త కిరణ్ జూలై 7న విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. చిన్న వయసులోనే భర్తను కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడ్డా. అలాంటి సమయంలో ప్రభుత్వం ఆదుకుంది. నెల తిరగకనే రూ.5 లక్షలు అందించింది. నా కష్టం ఎవరికీ రాకూడదని దేవున్ని ప్రార్థించా. అక్కా చెల్లెమ్మలకు అండగా సీఎం వైఎస్ జగన్‌ను ఆ దేవుడే పంపి ఉంటాడు.

– లక్ష్మీతులసి, అగ్రహారం, బుక్కపట్నం మండలం

బాధితులకు సాంత్వన



'వైఎస్సార్ ఉచిత బీమా' చాలా మంచి పథకం. కుటుంబ పెద్ద మృతి చెందిన సమయంలో బాధితులను ఎంతగానో ఆదుకుంటోంది. సచివాలయాల ద్వారా నేరుగా నామినీ ఖాతాకు నగదు జమవుతుంది. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఈ రెండు నెలల్లో 8 మంది బాధిత కుటుంబాలకు రూ.40 లక్షలు అందింది.

– నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ

ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో ఆదివారం విరాట్ విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పూలకుంట అరుణాచల్ సమక్షంలో విశ్వకర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సాధికారత అధికారి నిర్మలా జ్యోతి, సహాయ సంక్షేమ అధికారులు రాజకుల్లాయప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

- అంతకుముందు విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని పలువురు విశ్వబ్రాహ్మణ యువకులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు డంకనాచారి, గోపాలచారి, గోపి, మండలాల సంఘ అధ్యక్షులు విశ్వరూపాచారి, సత్యనారాయణాచారి, లక్ష్మీనారాయణాచారి, ఆనందాచారి, చరణ్‌చారీ, వెంగళమ్మ చెరువు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్టంట్ పరీక్షకు 157 మంది హాజరు

అనంతపురం: ఎస్కేయూ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు ఆదివారం అనంతపురంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించారు. డిగ్రీ 5, 6 సెమిస్టర్లలో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన వారికి అవకాశం కల్పించారు. మొత్తం 158 మంది దరఖాస్తు చేసుకోగా, 157 మంది హాజరైనట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ఫలితాలు ఈ నెల 19న విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

కుమారుడికి ప్రమాదం.. తల్లి హఠాన్మరణం



తీవ్రంగా గాయపడిన నాగిరెడ్డి

అమరాపురం: కుమారుడు రోడ్డు ప్రమాదం బారిన పడ్డారనే వార్త విన్న తల్లి హఠాన్మరణం చెందిన ఘటన మండలంలోని గౌడనకుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఆదివారం మండల పరిధిలోని గౌడనకుంటకు చెందిన నాగిరెడ్డి సొంత పనులపై కర్ణాటకలోని ద్రావణగెరెకు ద్విచక్రవాహనంలో వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మద్దిహళ్లి క్రాస్ సమీపంలో మద్దనకుంటకు చెందిన భీరప్ప బైకుతో ఆయనను ఢీకొన్నాడు. నాగిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఆయనను హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరు వెళ్లాలని సూచించారు. బంధువులు ఈ విషయాన్ని ద్రావణగెరెలో కుమార్తె వద్ద ఉంటున్న నాగిరెడ్డి తల్లి పుట్టమ్మ (58)కు తెలియజేశారు. వార్త విన్న వెంటనే ఆమె ఉన్నచోటునే కుప్పకూలిపోయింది. కాసేపటికే కన్నుమూసింది. మృతదేహాన్ని బంధువులు గౌడనకుంటకు తీసుకొచ్చి రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు. ఒక వైపు కుమారుడు ఆస్పత్రిలో ఉండడం, అదే సమయంలో తల్లి మరణించడం విషాదం నింపింది.

సందడిగా వార్షికోత్సవం

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్ అనుబంధంగా కొనసాగుతున్న కాలేజ్ ఆఫ్ నర్సింగ్, అలైడ్ సైన్సెస్ కళాశాల 15వ వార్షికోత్సవం ఆదివారం సందడిగా సాగింది. సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత వేడుకలు నిర్వహించారు. ఉదయం కళాశాల ప్రిన్సిపాల్ మంజూరి ప్రసంగించారు. కళాశాల ద్వారా అందిస్తున్న సేవల్ని వివరించారు. అనంతరం విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ రాజు, సిమ్స్ వైట్‌ఫీల్డ్ డైరెక్టర్ డాక్టర్.సుందరేషన్‌లు కళాశాల స్థాపించినప్పటి నుంచి అందించిన సేవలను వివరిస్తూ సావనీర్‌ను విడుదల చేశారు.



సావనీర్ విడుదల చేస్తున్న రత్నాకర్ రాజు



సంగీత కచేరీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన కృష్ణాపురం జమీర్ అహ్మద్, అనుచరులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన 200 కుటుంబాలు

ధర్మవరం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమైందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ధర్మవరం టీడీపీ ముస్లిం మైనార్టీ నేత, 10వ వార్డు ఇన్‌చార్జ్ కృష్ణాపురం జమీర్ అహ్మద్‌తో పాటు 200 కుటుంబాలు ఆదివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక జామియా మసీదు సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృష్ణాపురం జమీర్ అహ్మద్ వైఎస్సార్‌సీపీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పండుగలప్పుడు దువా చేసుకునేందుకు స్థలం లేక ముస్లింలు ఇబ్బందులు పడుతుండడం గుర్తించి పట్టణానికి అతి సమీపంలో 20 ఎకరాల సువిశాల స్థలంలో ఈద్గా స్థలం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఇందిరమ్మ కాలనీలో షాదీ మహల్ నిర్మించామన్నారు. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి 13,500కు పైగా ఇళ్లు మంజూరు చేశామన్నారు. గత టీడీపీ పాలన మొత్తం అవినీతి, అక్రమాలతో నిండిపోయిందన్నారు. చంద్రబాబు అవినీతి ఆయనను పాపంలా వెంటాడుతోందన్నారు. చట్ట పరిధిలో బాబుకు శిక్ష తప్పదన్నారు. స్కిల్ కుంభకోణంలో రూ.371 కోట్ల ప్రజాధనాన్ని టీడీపీ నాయకులు పందికొక్కులా తిన్నారన్నారు. ఈ స్కాంలో అవినీతి చేసినట్లు పూర్తి ఆధారాలు సీఐడీ అధికారులు చూపుతుండటంతో దిక్కుతోచని స్థితిలో పడి సాంకేతిక తప్పిదాలను వెతుకుతూ అవినీతిని దాచే ప్రయత్నం చేయడం వారికే చెల్లిందన్నారు. టీడీపీ మునిగిపోయిన నావ అని పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలు నచ్చే వైఎస్సార్‌సీపీలో చేరామని మైనార్టీ నేత కృష్ణాపురం జమీర్ అహ్మద్ పేర్కొన్నారు. స్వలాభం కోసం మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి వేరే పార్టీలోకి చేరినప్పటికీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రతీకార రాజకీయాలు చేయకుండా వార్డులో మైనార్టీ పేదలందరికీ పథకాలు అందించిన తీరు తనకు ఎంతో నచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో జమీర్ అహ్మద్ అనుచరులు రియాజ్ అహ్మద్, షహీన్‌షా, అరివుల్లా, ఇమ్ము, షాహిద్‌వలి, దావూద్, జునేద్, హసేన్‌వలి, హుసేన్ వలి, మహబూబ్ బాష, ముస్తఫా, బాబావలి, కృష్ణాపురం షాహిద్, దాదు, ఇమ్రాన్, బాబ్‌జాన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్‌చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, కౌన్సిలర్లు పెణుజూరు నాగరాజు, గజ్జల శివ, చందమూరి నారాయణరెడ్డి, గోరకాటి పురుషోత్తంరెడ్డి, మాసపల్లి సాయికుమార్, మేడాపురం వెంకటేశ్, అత్తార్ జిలాన్, కేతాలోకేష్, బ్రహ్మ, కో ఆప్షన్ సభ్యుడు కరీం, సీనియర్ నాయకులు ఉడుముల రామచంద్ర, షేక్ చాంద్‌బాష, జాకీర్, సుబాన్, బోయ నర్సింహులు, వడ్డే శ్రీనివాసులు, ఎస్పీ బాష, జాకీర్, సాధిక్‌బాష, బాలిరెడ్డి, తోపుదుర్తి వెంకటరాముడు, చెలిమి పెద్దన్న, కత్తె పెద్దన్న తదితరులున్నారు.



ఇకపై నిరంతర విద్యుత్తు

- రూ.45 కోట్లతో విద్యుత్తు సరఫరా సమస్యలకు చెక్
- కొత్తగా 32.20 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్ల ఏర్పాటు
- ఆరు విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వ కసరత్తు
- ఇప్పటికే ఒక సబ్‌స్టేషన్ ప్రారంభం
- మరో రెండు విద్యుత్ సబ్ స్టేషన్ల మంజూరు


నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్ స్టేషన్

మడకశిర: జిల్లాలో పూర్తిగా కర్ణాటక సరిహద్దును అనుకుని ఉన్న మడకశిర నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి జగన్ సర్కార్ నడుం బిగించింది. రైతులు, ఇతర విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేని విద్యుత్‌ను అందజేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టింది. ప్రధానంగా రైతులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే ధ్యేయంగా ప్రభుత్వం దాదాపు రూ.45 కోట్లతో విద్యుత్ లైన్లు, కొత్తగా సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ పనులన్నీ పూర్తయితే మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉంటుందని మేధావులు అంటున్నారు.

కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్ల ఏర్పాటు

మడకశిర నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని నివారించేందుకు అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొత్తం 32.20 కిలోమీటర్ల పొడవున కొత్తగా విద్యుత్‌లైన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.9 కోట్ల నిధులు వెచ్చించనున్నారు. మడకశిర మండలంలోని నీలకంఠాపురం– రొళ్ల వరకు 17.5 కిలోమీటర్లు, గుడిబండ మండలంలోని మందలపల్లి – రొళ్ల మండలం బీజీహళ్లి వరకు 7 కిలోమీటర్లు, మడకశిర – గొల్లపల్లి మధ్య 4.20 కిలోమీటర్లు, అమరాపురం– తమ్మడేపల్లి మధ్య 3.50 కిలోమీటర్ల చొప్పున కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటవుతున్నాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే సర్వే ప్రక్రియ ప్రారంభమైంది.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి మంజూరైన మొత్తం నిధులు	రూ.45కోట్లు
సబ్‌స్టేషన్ల నిర్మాణ ఖర్చు	రూ.36 కోట్లు
విద్యుత్ లైన్ల ఏర్పాటు వ్యయం	రూ.9 కోట్లు
ప్రస్తుతం మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్లు	02
ప్రతిపాదన దశలో ఉన్న సబ్‌స్టేషన్లు	06

ఆరు విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

నియోజకవర్గంలో ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు తొలుత అధికారులు ప్రతిపాదనలు పంపారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అభ్యర్థన మేరకు ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరుకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సైతం ఆమోదం తెలిపారు. శివరం, దొడ్డేరి, రంగనపల్లి, ఇనగలూరు, వైబీహళ్లి, ఆమిదాలగొంది గ్రామాల్లో నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. వీటి కోసం రూ.36 కోట్లను వెచ్చించనున్నారు. ఇప్పటికే రూ.4 కోట్ల ఖర్చుతో అగళి మండలం రామనపల్లిలో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రజా వినియోగంలోకి వచ్చింది.

మరో రెండు సబ్ స్టేషన్ల మంజూరు

నియోజకవర్గానికి ప్రభుత్వం మరో రెండు 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లను మంజూరు చేసింది. ఒక్కో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.4 కోట్లకు పైగా ఖర్చు చేయనున్నారు. మడకశిర మండలం గుండుమల, గుడిబండ మండలం రాళ్లపల్లి గ్రామాల్లో ఈ విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. గుండుమలలో స్థల సేకరణ కూడా పూర్తయింది. రాళ్లపల్లిలో స్థల సమస్య కారణంగా మడకశిర మండలం కదిరేపల్లి వద్ద రెండో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. అటవీ శాఖ పరిధిలోని స్థలంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు అధికారులు అనుమతులు సైతం పొందారు.

విద్యుత్ సమస్యలు తీరుతాయి



విద్యుత్ సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలూ తీసుకున్నాం. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సైతం ఆమోదం తెలిపారు. ఇప్పటికే ఆరు సబ్ స్టేషన్లు మంజూరు కాగా, మరో రెండు విద్యుత్ సబ్ స్టేషన్లు త్వరలో మంజూరు కానున్నాయి. ఈ పనులన్నీ పూర్తయితే విద్యుత్ సమస్య అనేది ఉండదు.

– తిప్పేస్వామి, ఎమ్మెల్యే, మడకశిర

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం



రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాం. కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్ల ఏర్పాటు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఇందు కోసం రూ.45 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

– సుబ్రహ్మణ్య వరప్రసాద్, డీఈఈ, మడకశిర

ఎంతో ఆనందంగా ఉంది



మడకశిర ప్రాంతంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రస్తుతం విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కొత్తగా విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేయడం ఎంతో గొప్ప విషయం.

– నారాయణప్ప, రైతు, టీడీపల్లి, రొళ్ల మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



రైతు పక్షపాత ప్రభుత్వం అనడానికి ఇదే నిదర్శనం. మారుమూల ప్రాంతమైన మడకశిరలో విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని రైతులకు అండగా నిలబడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఈ ప్రాంత రైతులందరూ రుణపడి ఉంటారు. – శ్రీనివాస్, రైతు, దాసప్పపాళ్యం, రొళ్ల మండలం





దక్షిణ భారతంలోనే అరుదైన ఆలయం

- విశేష పూజలు అందుకుంటున్న దశభుజ గణపతి


రాయదుర్గంలో వెలసిన దశభుజ గణపతి నిజరూప దర్శనం

రాయదుర్గం టౌన్: దక్షిణ భారతదేశంలోనే అరుదైన దశభుజ గణపతి ఆలయం వినాయక చవితి వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాయదుర్గం కొండపైకి వెళ్లే మార్గంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ గణపతి ఆలయానికి చాలా ప్రత్యేకత ఉంది. ఏకశిలపై దాదాపు 15 అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పుతో పది భుజాలతో వినాయకుడిని మలిచారు. కుడి వైపు మొదటి చేతిలో నారికేళం, రెండో చేతిలో చక్రం, మూడో చేతిలో త్రిశూలం, నాలుగో చేతిలో ధనుస్సు, ఐదో చేతిలో అంకుశం ఉంటాయి. ఎడమ వైపు మొదటి చేతిలో భార్య సిద్ధి, రెండో చేతిలో శంఖం, మూడో చేతిలో పవిత్రం, నాలుగో చేతిలో శరం, ఐదో చేతిలో ఖడ్గంతో దర్శనమిస్తుంటాయి. వినాయకుడి తొండం కుడివైపునకు ఉంటుంది. ఈ ఆలయానికి సిద్ధ వినాయక మందిరమని, మహా గణపతి ఆలయమని కూడా పిలుస్తుంటారు. ప్రతి ఆది, మంగళవారాల్లో విశేష పూజలు జరుగుతాయి. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక


లాంగ్ జంప్‌లో పాల్గొన్న క్రీడాకారుడు

అనంతపురం: ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకూ గుంటూరులోని నాగార్జున వర్సిటీ వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగింది. అండర్–14, 16, 18, 20, 23 విభాగాల్లో చేపట్టిన ఈ ప్రక్రియకు మొత్తం 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన 50 మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను అథ్లెటిక్స్ అడ్‌హాక్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్ పరిశీలించారు. ఎంపికైన అండర్ –14లో టి.రాజేష్, ఎస్.జాన్ అబ్బాస్, ఎస్.భరత్‌కుమార్, ఎస్.బాలాజీ, పి.దయాసాగర్, పి.సుమంత్, ఎస్.ముదాసిర్, జి.మహేష్ బాబు, ఎ.సుశాంత్, బాలికల్లో కె.లీలసాయి, సి.బి.లక్ష్యసాయిరెడ్డి, ఆర్.ఈ ఊహిత ఉన్నారు. అలాగే అండర్–16 విభాగంలో ఈ.భూపతిరెడ్డి, ఎ.దీపక్‌నాయక్, ఎ.మణికంఠ, ఓ.శశికాంత్, బి.శ్రీనివాసులు, ఈ.భరత్‌కుమార్, నరసింహారెడ్డి, జి.నందన్‌రెడ్డి, యూ.ప్రవీణ్, బి.అజయ్‌నాయక్, ఎం.దినేష్, జె.రోహిత్, జె.చంద్రశేఖర్, పి.మనోజ్ కుమార్ ఉన్నారు. అండర్–18లో సి.హర్షవర్ధన్‌నాయక్, బి.మంజునాథ్, బి.అఖిల్‌కుమార్, బి.పావల్, బి.మనోజ్, ఎస్.ఇర్ఫాన్, వి.గణేష్, ఎం.జగదీశ్వరరెడ్డి, డి.కుళ్లాయప్ప, బాలికల్లో కె.మౌనదేశాయ్, అండర్ 20 విభాగంలో కె.అఖిల్‌కుమార్, సి.ఇమామ్‌వలి, పి.అన్వర్‌వలి, కె.కార్తీక్, పి.ప్రవీణ్‌కుమార్, ఎస్.రేవంత్‌కుమార్, మహిళల్లో డి.ఆరీఫా ఉన్నారు. అలాగే అండర్ 23 విభాగంలో జి.మధు, ఎస్.ఉదయ్‌కుమార్, సి.గణేష్, కె.ఉదయ్‌శ్రీనివాస్, ఎస్.సాయి, వై.వంశి, కె.అఖిల్, మహిళల్లో టి.చరిత ఎంపికయ్యారు.

యువకుడి ఆత్మహత్య


వెంకటేష్(ఫైల్)

పరిగి: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలం శ్రీరంగరాజుపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ కాలనీకి చెందిన వెంకటేష్ (32)కు రొద్దం మండలం నల్లూరుకు చెందిన పార్వతితో వివాహమైంది. ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకుంటున్న వెంకటేష్‌కు మద్యం తాగే అలవాటు ఉంది. రెండు రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న వెంకటేష్ మద్యం మత్తులో చీరతో ఇంటి పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడి తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పాము కాటుతో రైతు మృతి

రొళ్ల: పాము కాటుతో ఓ రైతు మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం గిడ్డబొమ్మనహళ్లికి చెందిన రైతు రామప్ప (52) ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి పశువుల కోసం గడ్డి కోస్తుండగా పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న రామప్పను వెంటనే రొళ్ల పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందారు. మృతుడికి భార్య నరసమ్మతో పాటు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు.

జిల్లా హాకీ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

ధర్మవరం అర్బన్: జిల్లా హాకీ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ ప్రక్రియ చేపట్టారు. హాకీ ఆంధ్రప్రదేశ్ పరిశీలకులు అనిల్‌కుమార్, న్యాయవాది నరేష్ సమక్షంలో జరిగిన ఈ ప్రక్రియలో నూతన అధ్యక్షుడిగా బీవీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా గౌరి ప్రసాద్, ఉడుముల రామచంద్ర, మహమ్మద్ అస్లాం, ప్రధాన కార్యదర్శిగా సూర్యప్రకాష్, సంయుక్త కార్యదర్శులుగా అరవింద్‌గౌడ్, చంద్రశేఖర్, కోశాధికారిగా అంజన్న, ఈసీ సభ్యులుగా మారుతీకుమార్, రహమత్‌బీ, ఇర్షాద్‌ను ఎన్నుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని కోన కణ్వాశ్రమం వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. మృతుడిని యాచకుడిగా గుర్తించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఆచూకీ తెలిసిన వారు 94407 96836కు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

వ్యక్తి బలవన్మరణం

ధర్మవరం రూరల్: స్థానిక సుందర్య నగర్‌కు చెందిన చెన్నారెడ్డి (43) ఆదివారం రేగాటి పల్లి పొలాల్లో ఊజీ మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

ఆసియా క్రీడలకు అనూష

అనంతపురం: ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకూ చైనాలోని హాంగ్‌జౌలోని జరిగే 19వ ఆసియా క్రీడల్లో జరిగే మహిళా క్రికెట్ పోటీల్లో పాల్గొనే భారత జట్టులో నార్పల మండలం బండ్లపల్లికి చెందిన బి.అనూషకు చోటు దక్కింది. జట్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ , జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమన్‌జోత్ కౌర్, దేవిక వైద్య, టైటాస్ సాధు, రాజేశ్వరి గైక్వాడ్, మిన్నుమణి, కనికా అహుజా, ఉమా చెత్రీ, అనూషా, పూజా వస్త్రాకర్ ఉన్నారు.

గ్రూప్ – 1 విజేతలకు అభినందన


గ్రూప్-1 టాపర్లతో ముఖ్యఅతిథులు

అనంతపురం టవర్‌క్లాక్: నగరంలోని ఓ హోటల్‌లో గ్రూప్–1 టాపర్ల అభినందన సభ ఆదివారం ఘనంగా జరిగింది. ఫర్ ది సొసైటీ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఏఎస్ విశ్రాంత అధికారి చిన్న వీరభద్రుడు హాజరై, మాట్లాడారు. ఈ విజేతలు రేపటి దేశ భవితను తీర్చిదిద్దగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ అధ్యక్షుడు పోతుల రాధాకృష్ణ మాట్లాడుతూ... దృఢ సంకల్పంతో వైకల్యాన్ని జయించి గ్రూప్ 1 విజేతగా నిలిచిన కవిరాజును ప్రత్యేకంగా అభినందించారు. ఎస్కేయూ తెలుగు విభాగం ప్రొఫెసర్ సదాశివరెడ్డి, నార్పల తహసీల్దార్ హరికుమార్, కొత్తపల్లి సురేష్ మాట్లాడుతూ... పోతుల రాధాకృష్ణ ఆలోచన స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. విజేతలను సన్మానించుకోవడమంటే మనల్ని మనం గౌరవించుకున్నట్లేనని అభిప్రాయపడ్డారు. అనంతరం గ్రూప్ వన్ విజేతలు శ్రీరామచంద్ర, కవిరాజు, జ్ఞానానందరెడ్డి ఘనంగా సన్మానించారు. ఎస్కేయూ రిజిస్టర్ లక్ష్మయ్య, సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి రైతు మృతి


మృతుడు లక్ష్మీరెడ్డి

పుట్లూరు: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం గరుగు చింతలపల్లికి చెందిన రైతు లక్ష్మీరెడ్డి (72) ఆదివారం ఉదయం తన పొలానికి వెళ్లి పనుల్లో నిమగ్నమయ్యేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో తన షర్ట్‌ను తొలగించి చెట్టుకు తగిలిస్తుండగా అదుపు తప్పి పక్కనే ఉన్న బావిలో పడ్డాడు. బావిలో ఉన్న మొద్దులపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అయితే పొలం వద్దకెళ్లిన వ్యక్తి ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అటుగా వెళ్లి చూశారు. అప్పటికే బావిలో విగతజీవిగా పడి ఉన్న లక్ష్మీరెడ్డిని వెలికితీశారు. మృతుడి కుమారుడు నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చక్రంలో చిక్కుకున్న కొంగు.. వృద్ధురాలి మృతి

గుమ్మఘట్ట: ద్విచక్ర వాహనం వెనుక చక్రంలో కొంగు చిక్కుకుని కిందపడడంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని ఊడిమి గ్రామానికి చెందిన యశోదమ్మ (70) తన కుమారుడు రాజుతో కలసి ఆదివారం ఉదయం ద్విచక్రవాహనంపై రాయదుర్గం మండలం రాతిబావివంక గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలోని సిరిగెదొడ్డికి సమీపంలోకి చేరుకోగానే యశోదమ్మ చీర కొంగు ద్విచక్రవాహనం వెనుక చక్రానికి చుట్టుకోవడంతో అదుపు తప్పి కిందపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను రాయదుర్గంలోని సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో యశోదమ్మ మృతిచెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతురాలికి ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

లారీపై గజరాజు



సోమందేపల్లి: అరణ్యంలో స్వేచ్ఛగా తిరగాల్సిన గజరాజు లారీ ఎక్కి సవారీ చేసింది. ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి బెంగలూరు వైపుగా ఓ ఏనుగును లారీలో తీసుకెళుతూ సోమందేపల్లిలోని వైఎస్సార్ సర్కిల్‌లో కాసేపు ఆగారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని ఏనుగును ఆసక్తిగా గమనించారు.